క్లుప్తంగా

అవినీతి చంద్రబాబు ఆటలు సాగవు



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ డాక్టర్ మధుసూదన్

చిప్పగిరి: స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో చట్టం ముందు అవినీతి చంద్రబాబు ఆటలు సాగవని ఎమ్మెల్సీ డాక్టర్ మధుసూదన్ అన్నారు. మంగళవారం చిప్పగిరిలో ఆయన మాట్లాడుతూ.. అన్ని ఆధారాలతోనే ప్రతిపక్ష నాయకుడు చంద్రబాబును సీఐడీ అధికారులు అరెస్ట్ చేశారన్నారు. ఎవరికైనా చట్టం ఒకటేనని అన్నారు. అవినీతి, అక్రమాలకు పాల్పడడం టీడీపీ నాయకులకు కొత్తేమి కాదని ఆరోపించారు. తప్పులు వారు అరెస్టయిన తర్వాత కూడా అక్రమ అరెస్టులంటూ ప్రభుత్వంపై నిందలేయడం సమంజసం కాదని మండిపడ్డారు. చంద్రబాబు నాయుడు అరెస్ట్, రిమాండ్‌పై ఆ పార్టీ ఇచ్చిన బంద్ పిలుపును రాష్ట్ర ప్రజలు కనీసం పట్టించుకోలేదన్నారు. తప్పు చేసిన వారు చట్టంనుంచి తప్పించుకోలేరని స్పష్టం చేశారు. మాజీ ఎంపీటీసీ మల్లికార్జున వెంట ఉన్నారు.

ఆర్బీకేలలో అందుబాటులో ఎరువులు



రైతులకు ఎరువులను అందిస్తున్న ఏఓ అక్బర్‌బాష

వెల్దుర్తి: అన్ని ఆర్బీకేలలో రసాయన ఎరువులు అందుబాటులో ఉన్నాయని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఏఓ అక్బర్‌బాష తెలిపారు. మంగళవారం ఆయన మండల పరిధిలోని గోవర్ధనగిరి ఆర్బీకేలో ఆర్డర్‌పై కొనుగోలు చేసిన ఎరువులను రైతులకు పంపిణీ చేశారు. అనంతరం రైతులతో సమావేశమై ఈ-కేవైసీపై అవగాహన కల్పించారు. గడువులోపు పంట నమోదు, ఈ-కేవైసీ చేయించుకోవాలని సూచించారు. ఆర్బీకేల సిబ్బంది లింగన్న, స్వరూప, వలంటీర్లు పాల్గొన్నారు.

అర్హులందరికీ పింఛన్లు



పింఛన్ పంపిణీ చేస్తున్న అధికారులు

మద్దికెర: అన్ని అర్హతలున్న వారందరికీ పింఛన్లు మంజూరు చేయడం జరుగుతుందని ఎంపీడీఓ నరసింహమూర్తి, ఉప సర్పంచ్ గోపాల్ తెలిపారు. మంగళవారం మండల పరిధిలోని పెరవలి గ్రామంలో కొత్త పింఛన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మండలంలో రెండవ విడతలో 96 మందికి కొత్తగా పింఛన్లు మంజూరుకాగా వారికి రూ.2,68,500 సొమ్మును వలంటీర్ల ద్వారా పంపిణీ చేశారు. మద్దికెర-43, పెరవలి-14, బసినేపల్లి-7, బురుజుల-7, ఎం.అగ్రహారం-14, హంప-11 చొప్పున పింఛన్లు మంజూరయ్యాయి. ఈనెల 1వ తేదీ 141 పింఛన్లు మంజూరు కాగా మళ్లీ రెండవ విడతలో 96 పింఛన్లు మంజూరు చేయడం జరిగిందన్నారు. ఈఓ సుధాకర్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య సురక్ష పక్కాగా నిర్వహించాలి



మాట్లాడుతున్న ఎంపీడీఓ సీబీ కొండయ్య

చిప్పగిరి: ఈ నెల 15 నుంచి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం పక్కాగా నిర్వహించాలని ఎంపీడీఓ సీబీ కొండయ్య పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. మంగళవారం స్థానిక ఎంపీడీఓ కార్యలయంలో 'జగనన్న ఆరోగ్య సురక్ష' కార్యక్రమం విధివిధానాలపై పంచాయితీ కార్యదర్శులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 15 నుంచి ప్రతి ఇంటినీ సర్వే చేసి ప్రజల ఆరోగ్య వివరాలను యాప్‌లో నమోదు చేయాలన్నారు. ఆయా ఆరోగ్య సమస్యలకు నిపుణులైన వైద్యులచే చికిత్స అందించనున్నట్లు తెలిపారు. ఈఓపీఆర్డీ నాగభూషనం, పంచాయితీ కార్యదర్శులు, బాలన్న, నాయక్, నరేంద్ర, సుధీర్, సురేంద్ర, నరసింహులు, తదితరులు పాల్గొన్నారు.

రైతు భరోసాకు దరఖాస్తు చేసుకోండి

మద్దికెర: కొత్తగా పట్టాదారు పాసుబుక్‌లు పొందిన రైతులు ప్రభుత్వం అందించే రైతు భరోసా పథకానికి దరఖాస్తు చేసుకోవాలని ఏఓ రవి మంగళవారం సూచించారు. ప్రస్తుతం ఉన్న లబ్ధిదారులతో పాటు కొత్తగా వ్యవసాయ భూములు కొనుగోలు చేసి పాస్‌బుక్‌లు తీసుకున్న వారు ఈ పథకానికి అర్హులన్నారు. మరిన్ని వివరాలకు స్థానిక రైతు భరోసా కేంద్రాలలోని వ్యవసాయాధికారులను సంప్రదించి పట్టాదారు పాస్‌పుస్తకం, ఆధార్‌కార్డు, ఫోన్ నంబర్ అందజేయాలని సూచించారు.

చరిత్రలో నిలిచేలా జగనన్న పాలన

- నిత్యావసర ధరలపై పెంపుపై టీడీపీ దుష్ప్రచారం
- చంద్రబాబు అవినీతి చేశారు.. ఇరుక్కున్నారు..



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ రీజినల్ కో-ఆర్డినేటర్ రామసుబ్బారెడ్డి



గురజాలలో సచివాలయ భవనం ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే చెన్నకేశవ రెడ్డి, ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి, మేయర్ బీవై రామయ్య,జెడ్పీ చైర్మన్ పాపిరెడ్డి

నందవరం: చరిత్రలో నిలిచిపోయేలా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సుపరిపాలన అందిస్తున్నారని వైఎస్సార్‌సీపీ రీజినల్ కో-ఆర్డినేటర్, ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి పేర్కొన్నారు. మంగళవారం ముగ తి గ్రామంలో ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, జేసీఎస్ కన్వీనర్లు, గృహ సారథులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దివగంత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి అడుగుజాడల్లోనే సీఎం జగనన్న సంక్షేమ పాలన సాగిస్తున్నారన్నారు. ఉచిత విద్యుత్, పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాల అమలు చేయడంలో ప్రత్యేకత చాటుకున్నారన్నారు. సచివాలయ వ్యవస్థ, రైతు భరోసా కేంద్రాల ఏర్పాటు దేశంలోనే ఆదర్శంగా నిలిచిందని చెప్పారు. మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అవినీతి చేయడంతోనే జైలుకు వెళ్లారని, దర్యాప్తు సంస్థల విచారణలో ఆయన గుట్టు బయటపడిందన్నారు. ఆయన అరెస్టుపై అనవసర రాద్ధాంతం చేయడం సిగ్గుచేటన్నారు. అమరావతి లోనూ భారీ భూ కుంభకోణం జరిగిందని ఆరోపించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, జేసీఎస్ కన్వీనర్లు ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. తమ పార్టీ అభ్యర్థులను గెలిపించుకునేందుకు ఇప్పటి నుంచే శక్తివంచన లేకుండా శ్రమించాలని కోరారు.

నవరత్నాలతో సంక్షేమ పాలన

నవరత్నాల పథకాల అమలుతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పాలన సాగిస్తున్నారని పార్టీ జిల్లా అధ్యక్షుడు బీవై రామయ్య పేర్కొన్నారు. జిల్లా ప్రగతి కోసం కోట్లాది రూపాయలు వెచ్చించినట్లు గుర్తుచేశారు. రాష్ట్రంలో 19 మెడికల్ కాలేజీలు ఏర్పాటు చేయగా ఉమ్మడి కర్నూలు జిల్లాకు రెండు కాలేజీలు మంజూరు చేయడం సంతోషదాయకమన్నారు. ఎమ్మిగనూరులో వంద పడకల ఆసుపత్రి నిర్మాణం జరుగుతోందన్నారు. టీడీపీ నేతలు ఇచ్చిన హామీలకు ఆచరణ లేదన్నారు. టెక్స్‌టైల్ పార్కు, లేదర్ పార్కు నిర్మాణాల ఊసేలేదన్నారు. స్కిల్ డెవలప్‌మెంట్ పేరిట చంద్రబాబు రూ.371 కోట్ల అవినీతికి పాల్పడటం సిగ్గుచేటన్నారు. అవినీతి చక్రవర్తిగా ఆయనకు గుర్తింపు ఉందని ఆరోపించారు.

ఆదర్శంగా హామీల అమలు – ఎర్రకోట చెన్నకేశవ రెడ్డి

సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హామీల అమలుల్లో ఆదర్శంగా నిలిచారని ఎమ్మెల్యే ఎర్రకోట చెన్నకేశవ రెడ్డి ఉద్ఘాటించారు. ఎన్నికల హామీలకు కట్టుబడి ప్రతి హామీని అమలు చేయడం జగనన్నకే సాధ్యమైందన్నారు. చంద్రబాబు నాయుడు అధికార దాహంతో 600 హామీలు గుప్పించి ఏ ఒక్కటీ సక్రమంగా నెరవేర్చలేదన్నారు. జిల్లా జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, ఎంపీపీ లక్ష్మీదేవమ్మ, జెడ్పీటీసీ నిఖిల్ చక్రవర్తి, మండల కన్వీనర్ శివారెడ్డిగౌడ్, జేసీఎస్ మండల కన్వీనర్ చాంద్‌బాషా, ముగతి సర్పంచ్ విరుపాక్షిరెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, నరహర రెడ్డి, ఎంపీటీసీలు, గ్రామ సర్పంచులు, జేసీఎస్ కన్వీనర్లు పాల్గొన్నారు.

సచివాలయ వ్యవస్థ దేశానికే ఆదర్శం

గ్రామ సచివాలయాలు, వలంటీర్ వ్యవస్థ దేశానికే ఆదర్శంగా నిలిచిందని ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి, వైఎస్సార్‌సీపీ రీజినల్ కోఆర్డినేటర్, ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి అన్నారు. మంగళవారం గురజాల గ్రామంలో నూతన సచివాలయ భవనాన్ని వారితో పాటు జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, వైఎస్సార్‌సీపీ కర్నూలు జిల్లా అధ్యక్షుడు బీవై రామయ్య, సీనియర్ నాయకులు జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సచివాలయాలు, వలంటీర్ వ్యవస్థ ద్వారా అవినీతి రహిత పాలన సాగుతోందన్నారు. ఇంటి వద్దకే సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. గత టీడీపీ, ప్రస్తుత వైఎస్సార్‌సీపీ పాలనలో తేడాను ప్రజలు గమనించాలని కోరారు

వంతెన పరిశీలన

తెలంగాణ, ఆంధ్రాను కలుపుతూ తుంగభద్ర నదిపై రూ.44 కోట్లతో నిర్మించిన వంతెనను వారు పరిశీలించారు. 2009 వరదలతో నాగలదిన్నె వంతెన కొట్టుకుపోయిన విషయం విధితమే. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వంతెన నిర్మాణాన్ని పూర్తి చేయగా మంగళవారం ప్రజాప్రతినిధులు పరిశీలించారు. వంతెనను త్వరలోనే ప్రారంభించనున్నట్లు ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి పేర్కొన్నారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ శివారెడ్డిగౌడ్, స్థానిక నాయకులు ఉన్నారు.

ఎన్నికలకు సన్నద్ధం కావాలి

ఎమ్మిగనూరుటౌన్: జిల్లాలో ఒక ఎంపీ సీటుతో పాటు ఏడు ఎమ్మెల్యే స్థానాలను రానున్న ఎన్నికల్లో మరోసారి క్లీన్‌స్వీప్ చేయాలని, ఇందుకు వైఎస్సార్‌సీపీ శ్రేణులు ఇప్పటినుంచే కృషి చేయాలని రీజినల్ కో-ఆర్డినేటర్ రామసుబ్బారెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో ఆయన్ను, ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డిని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మద్దూరు సుబాష్ చంద్రబోస్ ఘనంగా సత్కరించారు. రానున్న ఎన్నికల్లో ఘన విజయం సాధించేందుకు కృషి చేయాలని ఆయన సూచించగా జిల్లాలో అన్ని స్థానాలు గెలిపించి సీఎం వైఎస్ జగన్‌కు గిఫ్టుగా ఇస్తామని పార్టీ అధ్యక్షుడు బీవై రామయ్య, జెడ్పీ చైర్మన్ పాపిరెడ్డి, గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఆయనకు హామీ ఇచ్చారు. వైఎస్సార్‌సీపీ నాయకులు ఎర్రకోట జగన్‌మోహన్‌రెడ్డి, బత్తుల లక్ష్మీకాంతయ్య, తదితరులు ఉన్నారు.

పిల్లిగుండ్లలో డెంగీ నిర్ధారణ

గోనెగండ్ల: మండల పరిధిలోని పిల్లిగుండ్ల గ్రామంలో రెండు డెంగ్యూ కేసులు నమోదైనట్లు జిల్లా మలేరియా అధికారి నూకరాజు తెలిపారు. దీంతో మంగళవారం వైద్య సిబ్బంది గ్రామంలో పర్యటించి నీళ్ల నిల్వ ఉన్న చోట శుభ్రం చేయించి గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ఇళ్లలోని బకెట్, డ్రమ్ములు, గచ్చులలో నీటిని ఎక్కువ రోజులు నిల్వ ఉంచుకోరాదన్నారు. పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. డెంగీ బాధితుల ఇళ్లకు వెళ్లి దోమల నివారణ మందు పిచికారీ చేయించారు. డివిజన్ మలేరియా అధికారి సాయిబాబా, సూపర్‌వైజర్ హనుమంతు, పరమేష్, ఏఎన్ఎం, ఆశా వర్కర్లు ఉన్నారు.

స్వల్పంగా పెరిగిన ఇన్‌ఫ్లో

హొళగుంద: కర్ణాటకలోని హోస్పేట వద్ద ఉన్న తుంగభద్ర జలాశయంలో ఇన్‌ఫ్లో స్వల్పంగా పెరిగింది. కొద్ది రోజుల క్రితం దాదాపు 500 క్యూసెక్కులకు పడిపోయిన ఇన్‌ఫ్లో జలాశయం ఎగువ భాగంలో అడపదడప కురుస్తున్న వర్షాలకు మంగళవారం 2,554 క్యూసెక్కులకు పెరిగింది. జలాశయం నుంచి 9,995 క్యూసెక్కుల నీటిని వివిధ కాలువలకు వదులుతున్నారు. ఉదయం డ్యాంలో నీటి నిల్వ 68.508 టీఎంసీలు ఉంది. ఆంధ్రాకు సంబంధించి దిగువ కాలువ (ఎల్లెల్సీ) 250 కి.మీ వద్ద 635 క్యూసెక్కుల నీరు ప్రవహిస్తోంది.

మెరుగైన సేవలందించాలి

కృష్ణగిరి: గ్రామ సచివాలయాల ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని ఎంపీపీ డాక్టర్ కంగాటి వెంకటరామిరెడ్డి సూచించారు. మండల పరిధిలోని అమకతాడు, కంబాలపాడు గ్రామ సచివాలయాలను ఆయన మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సచివాలయ ఉద్యోగులు సమయపాలన పాటించాలని సూచించారు. అలాగే సమస్యలపై సచివాలయానికి వచ్చే ప్రజలకు సకాలంలో సేవలు అందించాలన్నారు. అర్హులైన ప్రతిఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించాలని పంచాయతీ కార్యదర్శులను కోరారు.

జాబ్‌మేళాలో 40 మందికి ఉద్యోగాలు



ఉద్యోగ నియామక పత్రాలు అందుకున్న ఎస్ఎంఎల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు

ఎమ్మిగనూరుటౌన్: అనంతపురం ఆర్ట్స్ కళాశాలలో జరిగిన జాబ్‌మేళాలో స్థానిక ఎస్ఎంఎల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన 40 మంది విద్యార్థులు పలు కంపెనీల్లో ఉద్యోగాలకు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ మహబుబ్‌బాషా పేర్కొన్నారు. ఈ మేరకు ఆయా ఉద్యోగాలకు ఎంపికై నియామక పత్రాలు అందుకున్న విద్యార్థులతో కలిసి కళాశాలలో మంగళవారం ఆయన మాట్లాడారు. కళాశాల జేకేసీ కో-ఆర్డినేటర్ న్యూటన్‌రాజు ఆధ్వర్యంలో తమ కళాశాల నుంచి 80 మంది విద్యార్థులు జాబ్‌మేళాకు హాజరుకాగా వారిలో 40 మంది అపోలో, అమేజాన్, శ్రీసిటీ కంపెనీలకు ఎంపిక కావడం హర్షించదగ్గ విషయమన్నారు. ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులు నిబద్ధతతో పనిచేసి తమ భవిష్యత్‌కు మంచి బాటలు వేసుకోవాలని ప్రిన్సిపాల్ సూచించారు. కళాశాల సూపరింటెండెంట్ మద్దిలేటి తదితరులు పాల్గొన్నారు.

గణేష్ ఉత్సవాలు ప్రశాంతంగా జరుపుకోవాలి

పత్తికొండ టౌన్: గణేష్ ఉత్సవాలను శాంతియుతంగా జరుపుకోవాలని పత్తికొండ ఆర్డీఓ మోహన్‌దాస్ సూచించారు. స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో మంగళవారం డీఎస్పీ శ్రీనివాసరెడ్డితో కలిసి రెవెన్యూ, పోలీస్, పంచాయతీ రాజ్ శాఖల అధికారులు, గణేష్ మండపాల నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. ఆర్డీఓ మాట్లాడుతూ.. మండపాల నిర్వాహకులు పోలీసుల సూచనలు పాటించాలన్నారు. మండపాల ఏర్పాటుల్లో అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని, వాహనాల రాకపోకలు, ప్రజలకు ఇబ్బంది కలగకుండా చూసుకోవాలన్నారు. 18న గణేష్ విగ్రహాలు ప్రతిష్ఠించి 20వ తేదీన నిమజ్జనం చేయాలని సూచించారు. అర్బన్, రూరల్ సీఐలు మురళీమోహన్, ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, సర్కిల్ ఎస్ఐలు, తహసీల్దార్, ఎంపీడీఓ పాల్గొన్నారు.

ఆలూరు రూరల్: వినాయక చవితి పండుగ ప్రశాంతంగా నిర్వహించుకోవాలని ఆలూరు సీఐ వెంకటేశ్వర్లు సూచించారు. ఆలూరు పోలీసుస్టేషన్ ఆవరణలో వినాయక మండపాల నిర్వాహకులతో సమావేశం నిర్వహించి ఉత్సవాల నిర్వహనపై సూచనలు చేశారు.

హొళగుంద: వినాయక చవితి పండుగ, ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలని ఆలూరు సీఐ వెంకటేశ్వర్లు సూచించారు. మంగళవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐ శ్రీనివాసులు ఆధ్వర్యంలో ప్రజా ప్రతినిధులు, వినాయక ఉత్సవ కమిటీ నిర్వాహకులు, గ్రామ పెద్దలతో సీఐ సమావేశం నిర్వహించి ఉత్సవాల నిర్వహణపై పలు సూచనలు చేశారు.

కుక్కల దాడిలో 34 గొర్రె పిల్లలు మృతి



కుక్కల దాడిలో మృతి చెందిన గొర్రె పిల్లలు

నందవరం: మండల పరిధిలోని కనకవీడు గ్రామంలో మంగళవారం కుక్కల దాడిలో 34 గొర్రె పిల్లలు మృతి చెందాయి. గ్రామంలో రైతు, గొర్రెల కాపరి కాశప్ప గారి కురవ రమేష్ సోమవారం పెంటలో గొర్రె పిల్లలను ఉంచి గొర్రెల మందను మేతకు తీసుకెళ్లాడు. సాయంత్రం పెంటకు గొర్రెలను తీసుకుని వెళ్లి, వేర్వేరుగా గొర్రెలను, పిల్లలను వదిలాడు. మంగళవారం ఉదయం పెంటకు వెళ్లగా అందులో కుక్కలు దాడి చేయడంతో 34 గొర్రె పిల్లలు మృతి చెందాయి. రూ.1.50 లక్షలు నష్టం వాటిల్లడంతో కాపరి కన్నీరు మున్నీరయ్యాడు. ప్రభుత్వం ఆదుకోవాలని బాధిత రైతు వేడుకున్నాడు.

పండ్ల తోటల సాగుకు ప్రోత్సాహం

గోనెగండ్ల: పండ్ల తోటల సాగుచేసుకుంటే రైతులు ఆర్థికాభివృద్ధి చెందుతారని ఉద్యానవన శాఖ అధికారిణి శ్రీవాణి, కోర్స్ డైరెక్టర్ సుజాత అన్నారు. మంగళవారం స్థానిక ఎంపీడీఓ సమావేశ భవనంలో పండ్ల తోటల పెంపకదారులకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ సన్న, చిన్న కారు రైతులకు ప్రభుత్వం మామిడి, జామ, సపోట, దానిమ్మ, చీని, కొబ్బరి, నిమ్మ పండ్ల మొక్కలను ఉచితంగా అందజేయడంతో పాటు మొక్కల పెంపకానికి ప్రోత్సాహం అందిస్తుందన్నారు. మండలంలోని గోనెగండ్ల, చిన్నమరివీడు, అలువాల, ఐరన్‌బండ, గాజులదిన్నె, పుట్టపాశం, వేముగోడు, గంజిహళ్లి గ్రామాల్లోని రైతులు పండ్ల తోటలను సాగుచేశారని తెలిపారు. పండ్ల తోటల పరిరక్షణకు తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు. ఏపీఓ మహమ్మద్ బాష, ఈసీ ఉస్మాన్ రైతులు పాల్గొన్నారు.

అట్టహాసంగా స్కూల్ గేమ్స్

హొళగుంద: ఇంగళదహాళ్ జెడ్పీ ఉన్నత పాఠశాలలో మంగళవారం స్కూల్ గేమ్స్ నిర్వహించారు. అండర్-14, అండర్-17 విభాగాలకు సంబంధించి హొళగుంద, ఇంగళదహాళ్, హెబ్బటం, సుళువాయి, గజ్జహళ్లి పాఠశాలలకు చెందిన విద్యార్థులు ఆటల పోటీల్లో పాల్గొన్నారు. కబడ్డీ, ఖోఖో, త్రోబాల్, వాలీబాల్, బ్యాడ్మింటన్, యోగా, బాల్ బ్యాడ్మింటన్, టెన్నికాయిట్, అథ్లెటిక్స్ క్రీడాంశాల్లో పోటీలు నిర్వహించినట్లు పీడీ రాందాస్ తెలిపారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను తాలూకా స్థాయి పోటీలకు ఎంపిక చేసినట్లు ఆయన వెల్లడించారు.

బాధితుల ఆందోళన



ఆందోళనకు దిగిన భూమిని కొన్న బాధితులు

ఎమ్మిగనూరురూరల్: స్థానిక వీవర్స్ కాలనీలోని సాయిరాం హాస్పిటల్ ముందు భూమిని కొన్న వారు మంగళవారం ఆందోళనకు దిగారు. బాధితులు తెలిపిన వివరాలు.. 2019లో డాక్టర్ రఘు, ఆయన తండ్రి శివన్న, చెల్లెలు శారదమ్మకు చెందిన సర్వే నంబర్ 189, 190, 191, 192లోని 7.51 ఎకరాల పొలాన్ని వ్యాపారులు కొడుమూరు భాస్కరరెడ్డి, దళాలి అయూబ్, అన్వర్ ,కొనుగోలు చేశారు. అగ్రిమెంట్ ప్రకారం డబ్బు చెల్లించారు. డాక్టర్ రఘుకు సంబంధించిన భూమిని కొనుగోలు చేసిన వారికి రిజిస్ట్రేషన్ చేయించగా, డాక్టర్ చెల్లెలు శారదమ్మ మాత్రం రిజిస్ట్రేషన్ చేయించకుడా ఇబ్బందులకు గురిచేస్తుందని తెలిపారు. సదరు భూమిని ప్లాట్లు వేసి విక్రయించామని, ప్లాట్లు కొన్న వారు తమకు రిజిస్ట్రేషన్ చేయించాలని ఒత్తిడి తెస్తున్నారని వాపోయారు. చేసేది లేక శివన్న ఇంటి ముందు, హాస్పిటల్ ముందు ఆందోళనకు దిగినట్లు తెలిపారు. రెండు రోజుల్లో తమ సమస్య పరిష్కరించకపోతే ఆస్పత్రి ముందు నిరాహార దీక్షకు దిగుతామని పేర్కొన్నారు.

అసాంఘిక చర్యలకు పాల్పడితే శిక్ష తప్పదు

వెల్దుర్తి: గ్యాంబ్లింగ్, మట్కా, బెట్టింగ్ ఇతరత్రా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ చంద్రశేఖర్ రెడ్డి హెచ్చరించారు. మంగళవారం ఆయన తన స్టేషన్‌లో మాట్లాడుతూ అసాంఘిక చర్యలకు పాల్పడే వారిపై నాన్ బెయిలబుల్ కేసులు నమోదవుతాయన్నారు. కేసులు, కోర్టులు అంటూ సంఘంలో చెడ్డ పేరు, ఆర్థిక నష్టాలతో కుటుంబాలు ఛిన్నాభిన్నమవుతాయన్నారు. ఎక్కడైనా అసాంఘిక కార్యక్రమాలు జరుగుతున్నట్లు గుర్తిస్తే తన నంబరు 91211 01118కు కాల్ చేసి తెలుపవచ్చన్నారు. సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచి తగిన రివార్డు అందిస్తామని తెలిపారు.


30 నుంచి జగనన్న ఆరోగ్య సురక్ష

తుగ్గలి: ఈనెల 30వ తేదీ నుంచి జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ సావిత్రి తెలిపారు. తహసీల్దార్, ఎంపీడీఓ ఆధ్వర్యంలో నలుగురు డాక్టర్లతో కలిసి రెండు టీంలుగా ఏర్పడి కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. ఈ మేరకు మంగళవారం షెడ్యూల్‌ను విడుదల చేశారు. 30న బొందిమడుగుల, అక్టోబర్ 3న రాతన, 4న మారెల్ల, 5న పెండేకల్లు, 6న ముక్కెల్ల, 7న రాంపల్లి, 9న ఎద్దులదొడ్డి, 10న రామకొండ, 11న జొన్నగిరి సచివాలయం-1, 12న కడమకుంట్ల, 13న జొన్నగిరి సచివాలయం-2, 16న ఉప్పర్లపల్లి, 17న చెన్నంపల్లి, 18న శభాష్‌పురం , 19న గిరిగెట్ల, 20న జీ.ఎర్రగుడి సచివాలయాల్లో వైద్య శిబిరాలు నిర్వహించనున్నట్లు చెప్పారు.

రేపు మండలస్థాయి క్రీడా పోటీలు

ఆలూరు రూరల్: ఆలూరు ప్రభుత్వ బాలుర పాఠశాల-2 ఆవరణలో గురువారం మండల స్థాయి ఏపీ స్కూల్ గేమ్స్ ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు ఎంఈఓ కోమలాదేవి మంగళవారం ఓ ప్రకటనలో వెల్లడించారు. అండర్-14, అండర్-17 విభాగంలో బాలబాలికలకు కబడ్డీ, ఖోఖో, త్రోబాల్, బాల్ బ్యాడ్మింటన్, వాలీబాల్, షటిల్, యోగా, అథ్లెటిక్ పోటీలు ఉంటాయని చెప్పారు. ఆసక్తి గల క్రీడాకారులు ఉదయం 9 గంటలకు సంబంధిత ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాల నుంచి ధ్రువీకరణ పత్రం తీసుకొచ్చి ఆటల పోటీల్లో పాల్గొనాలని ఆలూరు ఏపీఎఫ్ మండల ఇన్‌చార్జ్ కవిరాజు తెలిపారు. మండలస్థాయిలో సత్తాచాటిన క్రీడాకారులను నియోజకవర్గ స్థాయికి ఎంపిక చేస్తామని వెల్లడించారు.

వైఎస్సార్‌సీపీ నాయకుడి మృతి



వెంకటేష్ (ఫైల్)

హాలహర్వి: వైఎస్సార్‌సీపీ నాయకుడు, మండల సచివాలయాల కన్వీనర్ చింతకుంట వెంకటేష్ (50) సోమవారం గుండెపోటుకు గురై మృతిచెందాడు. ఉదయం తలనొప్పిగా ఉందని బళ్లారి ఆస్పత్రికి వెళుతుండగా మార్గం మధ్యలోనే గుండెపోటుకు గురై మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. విషయం తెలుసుకున్న రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం చింతకుంట గ్రామానికి చేరుకుని మృతదేహంపై పూలమాలలు వేసి నివాళులర్పించారు. బాధిత కుటుంబ సభ్యులను ఓదార్చారు. మంత్రి మాట్లాడుతూ చింతకుంట వెంకటేష్ పార్టీ కోసం ఎంతో కృషి చేశారని, ఆయన మృతి పార్టీకి తీరనిలోటన్నారు. బాధిత కుటుంబాన్ని అన్నివిధాలా ఆదుకుంటామని భరోసా ఇచ్చారు. మృతుడికి రంజిత్, జ్యోతి సంతానం. వైఎస్సార్‌సీపీ నాయకులు గుమ్మనూరు నారాయణస్వామి, శ్రీనివాసులు, జెడ్పీటీసీ లింగప్ప, మండల కన్వీనర్ భీమప్పచౌదరి, పరశురామ్, మారయ్య, తదితరులు నివాళులర్పించారు.

మైసూరమ్మ ఊరేగింపు

మద్దికెర: స్థానిక మైసూరమ్మ దేవాలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా అమ్మవారికి డప్పు వాయిద్యాలతో బోనాలతో గ్రామ పురవీధుల గుండా ఊరేగింపు చేసి ఆలయంలో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి అభిషేకం, కుంకుమార్చన, మహామంగళహారతి ఇచ్చి నైవేద్యం సమర్పించారు. ఆకుపూజలు చేసిన అనంతరం పూజలు విచ్చేసిన భక్తులకు అన్నదానం చేశారు. పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

ప్రజారోగ్యానికి భరోసా

- రెండు దశల్లో ఆరోగ్య సురక్ష కార్యక్రమం
- ఈ నెల 15 నుంచి వలంటీర్, ఏఎన్ఎంల ద్వారా ఇంటింటికీ వెళ్లి ప్రజారోగ్య వివరాల సేకరణ
- అక్కడే బీపీ, షుగర్, రక్త పరీక్షలు తదితర ఉచిత ఆరోగ్య సేవలు
- ఈ నెల 30 నుంచి నెలరోజుల పాటు నిర్వహించే వైద్య శిబిరాల్లో స్పెషలిస్టు డాక్టర్లచే ఉచిత చికిత్సలు



మాట్లాడుతున్న మండల ప్రత్యేక అధికారి శ్రీనివాసకుమార్

వెల్దుర్తి: ప్రజల ఆరోగ్య సమస్యలను స్థానికంగానే గుర్తించి, స్పెషలిస్ట్ డాక్టర్ల ద్వారా ఉచితంగా చికిత్స అందించి వారి ఆరోగ్యానికి భరోసా కల్పించడమే 'జగనన్న ఆరోగ్య సురక్ష' కార్యక్రమ ధ్యేయమని మండల ప్రత్యేకాధికారి, ఎస్సీ కార్పొరేషన్ జిల్లా ఈడీ శ్రీనివాసకుమార్ అన్నారు. మంగళవారం ఆయన కార్యక్రమ నిర్వహణపై స్థానిక ఎంపీడీఓ శ్రీనివాసరావ్, రామళ్లకోట, గోవర్ధనగిరి పీహెచ్‌సీల డాక్టర్లు ప్రతిభ, నవీన్‌కుమార్‌లతో కలిసి ఏఎన్ఎంలు, ఎమ్ఎల్‌హెచ్‌పీలు, సెక్రటరీలు, సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్లతో ఎంపీడీఓ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. కార్యక్రమం విజయవంతంగా నిర్వహించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కల్పించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ 'జగనన్న ఆరోగ్య సురక్ష' కార్యక్రమం రెండు దశల్లో నిర్వహించనున్నట్లు తెలిపారు.

- మొదటి దశలో ఈ నెల 15 నుంచి వలంటీర్లు, ఏఎన్ఎంలు ప్రతి గ్రామ/వార్డు సచివాలయం పరిధిలోని ప్రతి ఇంటికీ వెళ్లి ప్రజల ఆరోగ్య స్థితిగతులను తెలుసుకుంటారన్నారు. సర్వేలో భాగంగా బీపీ, షుగర్, రక్త పరీక్షలు అవసరమైన వారికి అక్కడే నిర్వహించి ప్రజల హెల్త్ రిపోర్ట్ ప్రత్యేక యాప్‌లో పొందుపరుస్తారన్నారు. డాక్టర్లతో తదుపరి కన్సల్టెన్సీ అవసరమున్న వారిని గుర్తించి క్యాంపుల నిర్వహణ రోజున హాజరయ్యేలా చర్యలు తీసుకుంటారన్నారు.
- ఇంటింటి సర్వే అనంతరం రెండవ దశలో ఈ నెల 30 నుంచి తహసీల్దార్, ఎంపీడీఓలు ప్రత్యేక బృందాలుగా నెల రోజులపాటు సచివాలయాల పరిధిలో ప్రత్యేక వైద్య శిబిరాలను నిర్వహిస్తారన్నారు. శిబిరాలకు హాజరైన వారిలో అవసరమైన వారికి అక్కడే చికిత్స అందిస్తామన్నారు. శిబిరాలలో స్పెషలిస్ట్ డాక్టర్లు, ఫ్యామిలీ డాక్టర్, సిబ్బంది అందుబాటులో ఉంటారన్నారు. 162 రకాల మందులు, 18 రకాల శస్త్ర చికిత్సలు, 14 రకాల ఎమర్జెన్సీ కిట్లు తదితరాలుంటాయన్నారు. మరింత మెరుగైన చికిత్స అవసరమైన వారికి పెద్ద ఆసుపత్రులకు రెఫర్ చేస్తారన్నారు. కంటి వెలుగు కార్యక్రమంలో సేవలు పొందినవారికి కళ్ల అద్దాలు సైతం అందిస్తామన్నారు. ప్రజలకు ఈ కార్యక్రమంపై కరపత్రాల ద్వారా అవగాహన కల్పిస్తామని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ప్రజారోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ



ఆరోగ్య సిబ్బందికి శిక్షణ ఇస్తున్న డాక్టర్ మారుతి

ఆలూరు రూరల్: జగనన్న సురక్ష ద్వారా రాష్ట్ర ప్రభుత్వం ప్రజారోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోందని మొలగవల్లి పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ మారుతి అన్నారు. మంగళవారం ఆయన స్థానిక పీహెచ్‌సీలో వైద్యారోగ్య సిబ్బందికి ఒక్క రోజు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ నెల 15వ తేదీ నుంచి నెలాఖరు వరకు ఏఎన్ఎంలు సచివాలయం పరిధిలో ఉన్న ప్రతి ఇంటికీ తిరిగి ప్రజల ఆరోగ్యంపై సర్వే చేయాలన్నారు. అనారోగ్యం బారిన పడిన వారికి టోకెన్ ఇచ్చి సచివాలయం పరిధిలో నిర్వహించే హెల్త్ క్యాంపునకు వచ్చేలా చూడాలన్నారు. 15 రోజుల వ్యవధిలో వలంటీర్లతో పాటు రెండు సార్లు ఇంటింటికీ వెళ్లాలని చెప్పారు. ప్రజల ఆరోగ్య వివరాలు ఎప్పటికప్పుడు ప్రత్యేక యాప్, ఆరోగ్య శ్రీ యాప్‌లో నమోదు చేయాల్సి ఉంటుందన్నారు. వారి నుంచి బయోమెట్రిక్ తీసుకోవాలన్నారు. అలసత్వం వహించిన వారిపై చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఏదేని సాంకేతిక సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని చెప్పారు. సూపర్‌వైజర్లు ఏఎన్ఎంలు ఆరోగ్య సిబ్బంది హాజరయ్యారు.

మద్దికెర: రాష్ట్రంలోని ప్రజలందరికీ ఆరోగ్య భరోసా కల్పించేందుకు ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష పథకం అమలు చేస్తోందని తహసీల్దార్ నాగభూషణం , ఎంపీడీఓ నరసింహమూర్తి అన్నారు. మంగళవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ప్రభుత్వ వైద్యాధికారులు నగేష్, శ్రీలక్ష్మి ఆధ్వర్యంలో మండలంలోని సచివాలయ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ.. గ్రామాలలో సిబ్బంది, వలంటీర్లు తమ పరిధిలోని కుటుంబాల వద్దకు వెళ్లి ఆరోగ్య సమస్యలు ఉన్న వారిని గుర్తించి ఏఎన్ఎంలు, క్లస్టర్ల హెల్త్ ఆఫీసర్లకు సమాచారం ఇవ్వాలని, వారు ఈనెల 16 నుంచి ఇంటింటికీ వచ్చి బాధితులకు అవసరమైన వైద్య పరీక్షలు చేసి మందులు అందిస్తారని తెలిపారు.

బాలికలు ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలి

ఎమ్మిగనూరురూరల్: బాలికలు కౌమార దశలో వచ్చే సమస్యలపై జాగ్రత్తగా ఉండాలని బనవాసి కృషి విజ్ఞాన కేంద్రం గృహ నిర్వహణ శాస్త్రవేత్త డాక్టర్ అపర్ణ పేర్కొన్నారు. మంగళవారం బనవాసి ఏపీ గురుకుల పాఠశాలలో కేవీకే ఆధ్వర్యంలో జాతీయ పౌష్టికాహార వారోత్సవాల్లో భాగంగా విద్యార్థినులకు అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ.. బాలికలు కౌమార దశలో పౌష్టికాహారం తీసుకోకపోవడం వల్ల ఐరన్ లోపిస్తుందని చెప్పారు. మంచి పౌష్టికాహారం తీసుకుంటే ఆరోగ్యంగా ఉంటారని, అలాగే వ్యక్తిగత శుభ్రత పాటించాలన్నారు. ప్రిన్సిపాల్ సువర్ణలత, అధ్యాపక బృందం పాల్గొన్నారు.

పిల్లల్లో జన్యులోపాల నిర్ధారణకు పరీక్షలు



ఆలూరు అంగన్‌వాడీ కేంద్రంలో చిన్న పిల్లలకు ఆరోగ్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ శాంతి

ఆలూరు రూరల్: ఐదేళ్ల లోపు వయసున్న పిల్లల్లో జన్యులోపం (పుట్టుకతో వచ్చే లోపాలు) గమనించి తగిన చికిత్స అందించాలని మొలగవల్లి పీహెచ్‌సీ డాక్టర్ శాంతి అన్నారు. ఫ్యామిలీ ఫిజీషియన్‌లో భాగంగా మంగళవారం మొలగవల్లిలోని అంగన్‌వాడీ కేంద్రం-5లో ఆమె వైద్యారోగ్య సిబ్బందితో కలిసి పిల్లలకు వైద్య పరీక్షలు చేశారు. ఆమె మాట్లాడుతూ. పిల్లల ఆరోగ్య లోపాలు సకాలంలో గుర్తించకపోతే పిల్లలు జీవితాంతం వైకల్యాన్ని ఎదుర్కొవాల్సి వస్తుందన్నారు. చిన్నతంలో వచ్చే వినికిడి లోపంతో మూగవారిగా ఉండిపోతారన్నారు. రక్తహీనత లోపం రాకుండా పరిసరాల శుభ్రతతో పాటు వ్యక్తిగత శుభ్రత పాటించేలా తల్లిదండ్రులకు తెలియజేయాలని అంగన్‌వాడీ కార్యకర్తలు, ఏఎన్ఎంలకు సూచించారు. ఇందులో భాగంగానే మంగళవారం 26 మంది పిల్లలకు వైద్య పరీక్షలు చేశారు.